క్లుప్తంగా

వైఎస్ఆర్‌సీపీ క్లస్టర్ కమిటీల ఏర్పాటు

కర్నూలు (టౌన్) : కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో మూడు క్లస్టర్లకు కమిటీలు ఏర్పాటు చేస్తూ వైఎస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయం శనివారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటో క్లస్టర్‌కు అధ్యక్షుడిగా మహబూబ్ బాషా, ఇద్దరు ఉపాధ్యక్షులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి, ఆరుగురు కార్యదర్శులు, 15 మంది కార్యనిర్వాహక సభ్యులను నియమించారు. అలాగే రెండో క్లస్టర్‌కు సంబంధించి అధ్యక్షుడిగా మాదారపు కేదార్‌నాథ్‌తో పాటు ఇరువురు ఉపాధ్యక్షులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి, ఐదుగురు కార్యదర్శులు, 15 మంది కార్యనిర్వాహక సభ్యులు, అలాగే మూడో క్లస్టర్ పార్టీ అధ్యక్షుడిగా ఆదిమోహన్ రెడ్డి, ఇద్దరు ఉపాధ్యక్షులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి, ఐదుగురు కార్యదర్శులు, 15 మంది కార్యనిర్వాహక సభ్యులను నియమించారు.

ఈవీఎం గోదామును పరిశీలించిన డీఆర్వో

కర్నూలు(సెంట్రల్): కలెక్టరేట్‌లోని ఈవీఎం గోదామును డీఆర్వో కె.మధుసూదనరావు శనివారం పరిశీలించారు. సీసీ కెమెరాల పనితీరు, భద్రత ఇతర విషయాలపై అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాధారణంగా ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈవీఎం గోదామును ఎన్నికల అధికారులు పరిశీలిస్తారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ మురళీ, ఎలక్షన్ సెల్ అధికారులు పాల్గొన్నారు.

కోవిడ్‌పై అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(హాస్పిటల్): వాతావరణంలో వచ్చిన మార్పులతో ఇటీవల మళ్లీ వెలుగు చూస్తున్న కోవిడ్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య శనివారం ప్రకటనలో తెలిపారు. ప్రజలు గుంపులుగా లేకుండా కనీసం మూడు మీటర్ల భౌతిక దూరం పాటించాలని, మాస్కులు ధరించాలని, చేతులు తరచూ శానిటైజ్ చేసుకోవాలని సూచించారు. ఒకవేళ ఎవరికైనా దగ్గు, జ్వరం, జలుబు, తలనొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలన్నారు. పాజిటివ్ అని నిర్ధారణ అయితే వైద్యులు సూచించిన మందులు వాడుతూ హోమ్ ఐసోలేషన్‌లో వారం రోజుల పాటు ఉండాలని తెలిపారు.

పెద్దాసుపత్రికి సక్షన్ ఆపరేటర్లు విరాళం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు నగరంలోని కార్తీక హాస్పిటల్ అధినేత డాక్టర్ చంద్రశేఖర్ రెండు సక్షన్ ఆపరేటర్లను విరాళంగా ఇచ్చారు. శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డికి వీటిని ఆయన అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటరంగారెడ్డి మాట్లాడుతూ రూ.60 వేలు విలువజేసే సక్షన్ ఆపరేటర్లను పేదరోగుల కోసం ఇవ్వడం అభినందనీయమన్నారు.

రిజర్వేషన్ హక్కులు కల్పించాలి

కర్నూలు (అర్బన్): సంచార దళిత కులంగా ఉన్న బేడ బుడగ జంగాలకు రిజర్వేషన్ హక్కులు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ బేడ బుడగ సంఘం జిల్లా అధ్యక్షుడు తూర్పాటి మనోహర్ కోరారు. శనివారం స్థానిక శ్రీనివాస నగర్ కాలనీ నుంచి ప్రదర్శనగా వచ్చి సమావేశం నిర్వహించారు.

ఆందోళనలను పరిష్కరించండి

కర్నూలు(అగ్రికల్చర్): ప్రభుత్వం చొరవ తీసుకుని అంగన్‌వాడీ కార్యకర్తలతో పాటు వివిధ శాఖలకు సంబంధించిన ఉద్యోగుల డిమాండ్లను సానుభూతితో పరిశీలించాలని ఏపీ జేఏసీ ఉమ్మడి కర్నూలు జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళ్‌రెడ్డి కోరారు. ఆందోళన బాట పట్టిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఇతర ఉద్యోగులకు సంఘీభావంగా నూతన సంవత్సర వేడుకలకు దూరంగా ఉండాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ కర్నూలు నగర శాఖ అధ్యక్షుడు ఎంసీ కాశన్న, పాఠశాల ఉద్యోగుల సంఘం నేత బలరామిరెడ్డి, జిల్లా 4వ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మద్దిలేటి, ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఆర్అండ్‌బీ ఉద్యోగుల సంఘం నేత రమణ, ఎన్‌జీఓ అసోసియేషన్ నాయకులు చిరంజీవి, జనార్దన్‌రెడ్డి, ఎ.శ్రీనివాసులు, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సేఫ్ డెలివరీ క్యాలెండర్ ఆవిష్కరణ

కర్నూలు(హాస్పిటల్): జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి. రామగిడ్డయ్య శనివారం తన ఛాంబర్‌లో సేఫ్ డెలివరీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ క్యాలెండర్‌ను 10 నెలలకు సరిపడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలకు పంపిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీఐఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డీపీఎంఓ డాక్టర్ ఉమా, ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రామ్ అధికారి హేమలత, ఫ్యామిలి పిజీషియన్ కాన్సెప్ట్ నోడల్ అధికారి డాక్టర్ బాలమురళీకృష్ణ, డీపీఎంఓ సంధ్య పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

కర్నూలు కల్చరల్: విజ్ఞాన పీఠం అనాథాశ్రమంలో శనివారం అన్నదానం నిర్వహించారు. జీఎస్ఆర్ చారిటబుల్ సొసైటీ ఆధ్వర్యంలో అనాథలకు ఆహార పదార్థాలను వడ్డించారు. కార్యక్రమంలో జీఎస్ఆర్ హాస్పిటల్ ఎండీ డాక్టర్ జి.నాగేశ్వరయ్య, జి.లక్ష్మీదేవి, డాక్టర్లు కావ్య, వంశీకృష్ణ, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌తోనే సామాజిక సాధికారత

- చేసిన మేలు ప్రజలకు చెప్పేందుకు బస్సు యాత్ర
- వచ్చే నెల 4న కల్లూరులో నిర్వహణ
- సన్నాహక సమావేశంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే సామాజిక సాధికారత సాధ్యమని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా అన్ని వర్గాల ప్రజలకు ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాల సంక్షేమం కోసం వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తోందన్నారు. చేస్తున్న మేలును తెలియజేసేందుకు పార్టీ సామాజిక సాధికార బస్సు యాత్రకు శ్రీకారం చుట్టిందన్నారు. యాత్రలో భాగంగా వచ్చే నెల 4న కల్లూరులో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మెల్యే తన స్వగృహంలో నియోజకవర్గ పరిధిలోని కల్లూరు అర్బన్, కల్లూరు గ్రామీణ, ఓర్వకల్లు, పాణ్యం, గడివేముల మండలాలకు చెందిన నాయకులతో బస్సు యాత్ర విజయవంతానికి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తుందన్నారు. గత ప్రభుత్వాలు బడుగు బలహీన వర్గాలను పట్టించుకోలేదని, వారిని ఓటర్లుగా మాత్రమే చూశారన్నారు. నేడు తమ పార్టీ వారికి వివిధ పదవులు ఇచ్చి గౌరవిస్తుందన్నారు. 56 కార్పొరేషన్లు ఏర్పాటు చేసి చైర్మన్లు, డైరెక్టర్లను నియమించిందన్నారు. స్థానిక సంస్థల్లో మహిళలకు 50 శాతం సీట్లు కేటాయించిన ఘనత తమ పార్టీకే దక్కుతుందన్నారు. నాలుగున్నరేళ్ల వైఎస్ఆర్‌సీపీ పాలనలో రాష్ట్రంలో ప్రతి గడపకు లబ్ధి చేకూరిందన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పాలనకు మధ్య తేడాను గమనించాలన్నారు. ఎన్నికల సమీపిస్తుండటంతో టీడీపీ నాయకులు మాయమాటలు చెబుతున్నారని, అయితే, వారిని ప్రజలు నమ్మరన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి తమ పార్టీని ప్రజలు పట్టం కడతారని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రేణుక, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, కర్నూలు మార్కెట్ యార్డు చైర్మన్ మీదివేముల ప్రభాకర్‌రెడ్డి, కర్నూలు జిల్లా మైనార్టీ అధ్యక్షుడు జిలాన్ బాషా, నాలుగు మండలాలకు చెందిన ఎంపీపీలు, జెడ్పీటీసీలు, కల్లూరు అర్బన్ పరిధిలోని కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షులు, జేసీఎస్ కన్వీనర్ ఇన్‌చార్జ్‌లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు, మహిళలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఫోన్ చేస్తే చాలు సమస్య పరిష్కరిస్తా

- ప్రజా దర్బార్‌లో కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్


సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు (టౌన్): ఏదైనా సమస్య ఉంటే ఫోన్ చేసి తెలియజేస్తే చాలు వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ స్పష్టం చేశారు. శనివారం ఎమ్మెల్యే తన నివాసంలోని కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ కాలనీల వాసులు నేరుగా ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రాలు అందజేశారు. వాటిని ఆయన పరిశీలించి అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఘనత తమ ప్రభుత్వానిదే అన్నారు. అర్హత ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాల మంజూరు కాకపోతే తన దృష్టికి తీసుకురావాలన్నారు.

తక్కువ ధరకు నాణ్యమైన జనరిక్ మందులు

- జన ఔషధి కేంద్ర ప్రారంభోత్సవంలో డీసీఎంఎస్ చైర్ పర్సన్ శిరోమణి


డీసీఓ రామాంజనేయులుకు జనరిక్ మందులు అందజేస్తున్న చైర్‌పర్సన్

కర్నూలు(అగ్రికల్చర్): సామాన్య, మధ్య తరగతి ప్రజలకు మందుల భారాన్ని తగ్గించేందుకు ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాల ద్వారా తక్కువ ధరకే నాణ్యమైన జనరిక్ మందులను అందుబాటులోకి తెచ్చారని ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్ పర్సన్ సీహెచ్ శిరోమణి మద్దయ్య తెలిపారు. శనివారం కర్నూలు కొండారెడ్డి బురుజు సమీపంలోని డీసీఎంఎస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులుతో కలసి చైర్ పర్సన్ జన ఔషధి కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ... సహకార వ్యవస్థ ద్వారా కూడా జనరిక్ మందులను ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనేది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. ఇందుకు అనుగుణంగా మొదద డీసీఎంఎస్‌లో జన ఔషధి కేంద్రాన్ని ప్రారంభించినందుకు ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. అల్లోపతి మందుల ధరలతో పోలిస్తే 50 నుంచి 90 శాతం తక్కువ ధరలకే జనరిక్ మందులు లభిస్తాయని పేర్కొన్నారు. అన్ని రకాల వ్యాదులకు ఈ మందులు లభిస్తాయని పేర్కొన్నారు. జిల్లా సహకార అధికారి ఎస్.రామాంజనేయులు మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డీసీఎంఎస్‌తో పాటు పలు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో కూడా జనరిక్ ఔషధాలతో ప్రధానమంత్రి జన ఔషధి కేంద్రాలను ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ రాజేష్, బ్రాంచీ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

టీకాలతో ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ


చిన్నారికి చుక్కల మందు వేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): టీకాలు పిల్లలకు వేయించడం ద్వారా ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చునని జిల్లా వ్యాధినిరోధక టీకాల అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ చెప్పారు. శనివారం శ్రీరామనగర్ యూపీహెచ్‌సీ పరిధిలోని బిర్లా కాంపౌండ్ సచివాలయంలో జరుగుతున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ గర్భిణులు, ఐదేళ్లలోపు పిల్లలకు ఇవ్వాల్సిన టీకాలను క్రమం తప్పకుండా ఇవ్వాలని, ఆ వివరాలను ఎంసీపీ కార్డులో నమోదు చేసి ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్, యూవిన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. గర్భిణులను 12 వారాల్లోపు నమోదు చేసుకుని సమయానుసారంగా ఆరోగ్యసేవలు అందించాలని, వారు కాన్పునకు వెళ్లాల్సిన ఆసుపత్రిని ముందుగానే గుర్తించి ఆ వివరాలను ఏఎన్‌ఎం యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అనంతరం గర్భిణులు, బాలింతలకు అందుతున్న ఆరోగ్యసేవల గురించి తెలుసుకుని వారికి మాతాశిశు సంరక్షణ గురించి వివరించారు. నువ్వులు, బెల్లము, రెడ్ కిడ్నీ, బీన్స్, పచ్చని ఆకుకూరలు, కూరగాయలు, డ్రైఫ్రూట్స్, గింజలు అందరూ తిని ఆరోగ్యంగా ఉండాలని తెలిపారు. గర్భిణి కాలంలో క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రక్తస్రావం, అధిక రక్తహీనత, శ్వాస తీసుకోవడంలో ఆయాసం, 12 గంటలకు పైగా పురిటినొప్పులు, తగు ప్రమాదపు సూచికలు అనిపిస్తే ఆశ, ఏఎన్‌ఎంలకు తెలిపి వెంటనే ఆసుపత్రికి వెళ్లాలని తెలిపారు. అనంతరం ఆయన గర్భిణిలకు ఐరన్ మాత్రలు, బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు ఐఎఫ్ఏ, విటమిన్–ఎ సిరఫ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీఎం ప్రసాద్, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వైద్యులకు నైపుణ్యాలపై ముగిసిన శిక్షణ


ప్రిన్సిపాల్ డాక్టర్ పి. సుధాకర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటరంగారెడ్డి

కర్నూలు(హాస్పిటల్): నేషనల్ మెడికల్ కౌన్సిల్ నిబంధనల మేరకు మూడురోజులుగా కర్నూలు మెడికల్ కాలేజీలోని మెడికల్ ఎడ్యుకేషన్ యూనిట్‌లో వైద్యులకు నిర్వహిస్తున్న బీసీఎంఈ కోర్సు శనివారం ముగిసింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి. వెంకటరంగారెడ్డి హాజరై మాట్లాడారు. వైద్య విద్యార్థులకు ఉత్తమ బోధనను అందించేందుకు ఎప్పటికప్పుడు ఆచార్యులు అప్‌డేట్ కావాలన్నారు. వారు తప్పనిసరిగా టీచింగ్ మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు పదోన్నతి పొందేందుకు ఈ కోర్సు ఉపయోగపడుతుందని చెప్పారు. దీంతో పాటు వైద్యులు తమ పబ్లికేషన్స్ సమర్పించడం, బీసీబీఆర్ టెస్ట్ ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ అబ్జర్వర్ డాక్టర్ శృతి, ఎస్పీఎం ప్రొఫెసర్ డాక్టర్ సింధియా తదితరులు పాల్గొన్నారు.

మైపర్‌లో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు

కర్నూలు సిటీ: మదర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో శనివారం ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు నిర్వహించారు. బీ–ఫార్మసీ, ఫార్మా–డీ మొదటి సంవత్సర విద్యార్థులకు ద్వితీయ సంవత్సర విద్యార్థులు స్వాగతం పలికారు. కార్యక్రమానికి ప్రభుత్వ జనరల్ హాస్పటల్ పర్యవేక్షకులు డా.వి వెంకట రంగారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. ఫార్మసీ విద్యను అభ్యసించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం కాలేజీ డైరెక్టర్ డా.ఆదిమూలపు సతీష్ మాట్లాడుతూ విద్యార్థి దశ జీవితంలో చాలా కీలకమైందని, ఇక్కడ తీసుకునే నిర్ణయాలే భవిష్యత్తును నిర్ణయిస్తాయన్నారు. సమయాన్ని వృథా చేసుకోకుండా నిత్యం ఏదో ఒక అంశాన్ని తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. వేడుకల్లో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కాలేజీ అకడమిక్ డైరెక్టర్ డా.స్టెల్లా సతీష్, ప్రిన్సిపాల్ డా. జె. రవికుమార్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డా.కాకర్ల సురేష్, డా.రాజ్‌కుమార్, డా.సేహన్నా, రఘువీర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ స్వరూప రాణి సేవలు ఎనలేనివి


స్వరూప రాణిని సన్మానిస్తున్న అధికారులు, వైద్యులు

కర్నూలు (హాస్పిటల్) : ఫార్మకాలజీ విభాగంలో డాక్టర్ స్వరూప రాణి అందించిన సేవలు ఎనలేనివని కర్నూలు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సుధాకర్ చెప్పారు. పదవీ విరమణ చేసిన ఫార్మకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ స్వరూప రాణిని శనివారం మెడికల్ కళాశాలలోని కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులు, వైద్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సుదీర్ఘ కాలం కర్నూలు మెడికల్ కళాశాలలో డాక్టర్ స్వరూప రాణి ఉత్తమ సేవలందించారని కొనియాడారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, వైద్యులు రాధారాణి, సి.వి.రావు, పద్మ విజయశ్రీ, రాజేష్, సోమప్ప, మంజుల బాయి, శ్రీరాములు, విజయానంద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు


ఇస్మాయిల్ దంపతులను సన్మానిస్తున్న వర్సిటీ వీసీ ఫజులుర్ రహమాన్, తదితరులు

కర్నూలు కల్చరల్: ఉద్యోగ జీవితంలో ప్రతి ఒక్కరికీ పదవీ విరమణ తప్పనిసరి అని, ఉత్తమ సేవలు అందించిన వారికి ఎప్పటికి గుర్తింపు ఉంటుందని రాయలసీమ విశ్వ విద్యాలయం వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎ.ఫజులుర్ రహమాన్ అన్నారు. ఆర్‌యూ గ్రంథాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న మహమ్మద్ ఇస్మాయిల్ శనివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 33 సంవత్సరాల ఉద్యోగ జీవితాన్ని పూర్తి చేసుకున్న అనంతరం ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ భవిష్యత్తులో ప్రశాంత జీవనం గడపాలన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య సుందరానంద పుచ్చ, వర్సిటీ పాలకమండలి సభ్యులు ఆచార్య ఎన్‌టీకే నాయక్ మాట్లాడారు. వర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అతిథులతో పాటు సంఘం అధ్యక్షుడు సురేంద్ర బాబు, కార్యదర్శి ఆంజనేయులు, బోధనేతర ఉద్యోగులు, ఆచార్యులు, అధ్యాపకులు హాజరై ఇస్మాయిల్‌ను సన్మానించారు. ప్రముఖ గజల్ గాయకుడు మహమ్మద్ మియా తన పాటలతో సభికులను అలరింపజేశారు.

క్రైం కార్నర్

పట్టుబడిన దొంగలు

- రూ.20.88 లక్షల విలువ చేసే నగలు, నగదు స్వాధీనం
- ఆటోలు, ద్విచక్ర వాహనాలు సీజ్

కర్నూలు : కర్నూలు మండల పరిధిలోని వివిధ ప్రాంతాల్లో చోరీలకు పాల్పడి తప్పించుకు తిరుగుతున్న 12 మంది దొంగలను కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. ఇందులో ముగ్గురు మైనర్లు కూడా ఉన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసుకుని సీఐ శ్రీరాం ఆధ్వర్యంలో నిందితుల కోసం గాలిస్తుండగా కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామ పొలిమేరలోని రాగమయూరి రిసార్ట్స్ వద్ద ఉన్న బీడు భూముల్లో కొంతమంది అనుమానాస్పదంగా ఉన్నట్లు సమాచారం అందింది. శనివారం వల పన్ని అక్కడ ఉన్న 12 మందిని అదుపులోకి తీసుకుని విచారించగా వారి నేరాల చిట్టా బయటపడింది. ఓర్వకల్లుకు చెందిన కురువ ప్రవీణ్, కల్లూరు మండలం పెద్దపాడు గ్రామానికి చెందిన బోయ మణికుమార్, కర్నూలు వడ్డెగేరికి చెందిన సాయిప్రసాద్, స్వామిరెడ్డి నగర్‌కు చెందిన మహేష్ బాబు, గుంటూరు టౌన్ కొత్తపేటకు చెందిన జొన్నలగడ్డ అశోక్ (ప్రస్తుతం కర్నూలు శివారులోని నంద్యాల చెక్‌పోస్టు వద్ద నివాసం), కల్లూరులోని శ్రీనివాసరెడ్డి నగర్‌కు చెందిన చెంచు వెంకటేష్, కల్లూరులోని చెంచునగర్‌కు చెందిన చెంచు నాగేంద్ర, కర్నూలు ఎస్‌ఏపీ క్యాంప్ సమీపంలోని లేబర్ కాలనీకి చెందిన దాడిపోగు కల్యాణ్ తదితరులు జట్టుగా ఏర్పడి పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు అంగీకరించారు. జల్సాలకు అలవాటు పడి ఖర్చుల కోసం మొదట చిన్నచిన్న దొంగతనాలు చేస్తూ తర్వాత ఇళ్ల ముందు పార్క్ చేసిన వాహనాలు, ఇళ్ల దొంగతనాలు చేసినట్లు వారు విచారణలో అంగీకరించారు.

వీరి నేరాల చిట్టా...

- మామిదాలపాడు శివారులోని ఫామ్ ట్రీ విల్లా నివాసంలో ఉంటున్న రఘునాథ్‌రెడ్డి ఇంట్లో ఈనెల 19వ తేదీన దాదాపు రూ.3 లక్షలు విలువ చేసే డైమండ్ ఉంగరాలు, బంగారు చైన్ చోరీ చేశారు.
- పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలోని ప్రిన్సిపాల్ చాంబర్‌లో ఈ ఏడాది ఫిబ్రవరి 8వ తేదీన రూ.2.44 లక్షలు తస్కరించారు.
- వెంగన్నబావి సమీపంలోని అంబేడ్కర్ నగర్‌లో నివాసముంటున్న పెరుమాళ్ల సరోజమ్మ ఇంట్లో ఈనెల 25వ తేదీన 9 తులాల బంగారం, 70 తులాల వెండి, రూ.1.27 లక్షల నగదు చోరీ చేశారు.
- బాలాజీ నగర్‌లో ఈనెల 21వ తేదీన షేక్ షాలిమియా, మాధవరెడ్డిలకు చెందిన మూడు మోటర్ సైకిళ్లు, ఒక ఆటో చోరీ చేశారు.
- భూపాల్ నగర్‌లో మహిళకు సంబంధించిన బంగారు చైన్‌ను తస్కరించినట్లు విచారణలో నిందితులు అంగీకరించడంతో వారిపై కేసు నమోదు చేసి వారి వద్ద నుంచి రూ.20.88 లక్షలు విలువ చేసే నగలు, నగదు రికవరీ చేసినట్లు సీఐ శ్రీరాం తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు.

స్పోర్ట్స్

ఉత్సాహంగా క్రీడాపోటీలు


ఖో-ఖో ఆడుతున్న సచివాలయాల జట్లు

కర్నూలు (టౌన్) : ఆడుదాం..ఆంధ్ర క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. సచివాలయాల పరిధిలో జరుగుతున్న ఈ పోటీలకు ఐదవరోజు శనివారం క్రీడాకారుల నుంచి మంచి స్పందన లభించింది. నగరంలోని 30 క్రీడా ప్రాంగణాల్లో జరుగుతున్న ఈ పోటీల్లో మహిళలు ఎక్కువ సంఖ్యలో పాల్గొన్నారు. కోల్స్ కళాశాల, స్పోర్ట్సు అథారిటీ స్టేడియం, ఎస్‌టీబీసీ కళాశాల క్రీడా మైదానంతో పాటు టౌన్‌మోడల్ స్కూల్, బి.క్యాంపు క్రీడా మైదానాల్లో పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఐదో రోజు పోటీలను జిల్లా స్పోర్ట్స్ అథారిటీకి చెందిన క్రీడల అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ప్రారంభించి మాట్లాడారు. జనవరి 4 వ తేదీ వరకు సచివాలయాల పరిధిలో పోటీలు ఉంటాయని, ఆతరువాత మండల స్థాయిలో క్రీడలు ప్రారంభమవుతాయన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పోటీల వివరాలు :

స్థానిక చల్లా కాంపౌండ్ సచివాలయం పరిధిలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో సాయికుమార్, బెన్‌హార్ 30–18 స్కోర్ చేసి చరణ్‌కుమార్, మహేశ్వర్‌పై గెలిచారు. మహిళల విభాగంలో షఫీ తబస్సుం, సంబాల 30–16 స్కోర్ చేసి అలంకృతి, కావ్యహర్షిత్‌పై గెలిచారు. మహిళల కబడ్డీ పోటీల్లో అంకిత జట్టు 9–7పాయింట్ల స్కోర్‌తో నాగమణి జట్టుపై విజయం సాధించారు. ఖో-ఖో పోటీల్లో అంకిత జట్టు ద్రాక్షాయని జట్టుపై 7–2 పాయింట్లతో గెలిచారు. ఉస్మానియా కళాశాల మైదానంలో పెద్ద పడఖాన సచివాలయం పరిధిలోని క్రీడాకారుల మధ్య జరిగిన పురుషుల బ్యాడ్మింటన్ పోటీల్లో అవినాష్, కార్తీక్ 30–13 స్కోర్‌తో నరేష్, హరిక్రిష్ణపై గెలిచారు. మహిళల విభాగంలో అశ్విని, వెంకటేశ్వరి 30–18 పాయింట్ల ఆధిక్యతతో సుమలత, సుప్రియపై విజయం సాధించారు.

సంక్షిప్తం

సీఎంకు పోస్టుకార్డు పంపిన అంగన్‌వాడీలు

కర్నూలు(సెంట్రల్) : తమ సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలు కొనసాగుతున్నాయి. 19వ రోజు శనివారం శ్రీకృష్ణ దేవరాయల సర్కిల్ నుంచి సీఎంకు పోస్టుకార్డు పంపారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్. మునెప్ప, చంద్రశేఖర్, ఉప కార్యదర్శి టి.రామాంజనేయులు, సీఐటీయూ జిల్లాప్రధాన కార్యదర్శులు సుధాకరప్ప, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమ్మె

కర్నూలు(సెంట్రల్): సమగ్ర శిక్ష అభియాన్‌లో పని చేసే ఉద్యోగులు తమ సమస్యల కోసం చేపట్టిన సమ్మె శనివారానికి పదో రోజుకు చేరుకుంది. శ్రీకృష్ణదేవరాయల సర్కిల్‌లో చేపట్టిన ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఏ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాజు, రంగన్న మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం కింద రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కర్నూలు (టౌన్): నగరపాలక సంస్థ పరిధిలో పని చేసే క్లాప్ డ్రైవర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ నగర కమిటీ నాయకులు రఘు శేఖర్, కుమార్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట క్లాప్ డ్రైవర్ల సమ్మె 14 వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో సంఘం నాయకులు షేక్షావలి, రవి, శ్రీను, దశరథ్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల రిలేదీక్షలు

కర్నూలు (లీగల్) : ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ టైట్లింగ్ చట్టం, జీవో నెం.512ను రద్దు చేయాలని న్యాయవాదులు ధర్నా చౌక్‌లో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 20వ రోజుకు చేరాయి. శనివారం రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ రవి గువేరా, మాజీ కార్యదర్శి చంద్రుడు, అనిల్‌కుమార్ దీక్షలను ప్రారంభించారు.

పీసీసీ మైనార్టీ విభాగం ఉపాధ్యక్షుడిగా మున్న

కర్నూలు(సెంట్రల్) : పీసీసీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కొత్తపేట మున్న ఎంపికయ్యారు. ఈమేరకు శనివారం డీసీసీ అధ్యక్షుడు కె.బాబురావు ఆయనకు నియామక పత్రం అందజేశారు.

3 నుంచి సమ్మె బాట

కర్నూలు (టౌన్) : డిమాండ్ల సాధన కోసం వచ్చే నెల 3 వ తేదీ నుంచి మున్సిపల్ కార్మికులు సమ్మె చేపట్టనున్నట్లు ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పులగం మద్దిలేటి స్పష్టం చేశారు. శనివారం స్థానిక నగరపాలక సంస్థ ఎదుట ఆ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు టాయ్‌లెట్ వర్కర్లు, టైం స్కేల్ వర్కర్లను పర్మినెంట్ చేయాలన్నారు. అనంతరం నగరపాలక ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.

అనాథ పిల్లలకు దుస్తుల పంపిణీ

కర్నూలు (టౌన్): స్థానిక నగర శివారులోని జి.పుల్లారెడ్డి ఇంజినీరింగ్ కళాశాల వెనుక వైపు ఉన్న హోమ్ ఆఫ్ హోప్ మినిస్ట్రీస్ అనాథ ఆశ్రమంలోని పిల్లలకు శనివారం రాత్రి దుస్తులు పంపిణీ చేశారు. క్రైస్తవ విద్యుత్ ఉద్యోగుల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ ఉమాపతి హాజరై పిల్లలకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు రంగస్వామి, రాజు, జాన్ బెర్నాడ్, ఆనంద్ దేవపాల్ పాల్గొన్నారు.

ముజఫర్‌నగర్ యూపీహెచ్‌సీ తనిఖీ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.రామగిడ్డయ్య శనివారం నగరంలోని ముజఫర్‌నగర్‌లో ఉన్న పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. అక్కడి రికార్డులు, రిపోర్టులు చూసి మందులు ఉన్నాయా లేదా అని పరిశీలించారు. జాతీయ ప్రోగ్రామ్‌లన్నీ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, అన్ని ప్రోగ్రామ్స్ వంద శాతం ఉండే విధంగా చూడాలన్నారు. ఆశ, ఏఎన్‌ఎంలు ప్రతిరోజూ ఇంటింటికి తిరిగి జలుబు, దగ్గు, జ్వరం రోగగ్రస్తులను గుర్తించి వైద్యాధికారుల వద్దకు తీసుకురావాలన్నారు.

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ వేడుకలు

కర్నూలు(సెంట్రల్): భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) 53వ ఆవిర్భావ వేడుకలు సుందరయ్య సర్కిల్‌లో ఆ సంఘం విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ కర్నూలు నగర కార్యదర్శి సాయి ఉదయ్ ఆధ్వర్యంలో జెండాను ఎగురు వేశారు. స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం లక్ష్యాల సాధన కోసం ఎస్ఎఫ్ఐ ఆవిర్భావించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం 1970 డిసెంబర్ 30 నుంచి 2023 డిసెంబర్ 30వ తేదీ వరకు అలుపెరగకుండా ఎస్ఎఫ్ఐ పోరాటాలు చేస్తోందన్నారు. కార్యక్రమంలో అబూబకర్, భాస్కర్, మల్లేష, ఆర్యన్, రాము, అశోక్, జగదీష్ పాల్గొన్నారు.

మెప్మా ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కర్నూలు(సెంట్రల్): మెప్మాలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)లకు ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎండీ అంజిబాబు డిమాండ్ చేశారు. శనివారం ఆ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆర్పీలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆర్పీలకు కనీస వేతనం రూ.26 వేలతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలన్నారు. రాజకీయ వేధింపులు తగ్గేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్పీల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమాదేవి, నాయకులు శ్యామల, షబానా, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.